ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
3
సోమవారం 19 ఆగస్టు 2024



రైతులకు సర్వే కష్టాలు
5లో..

గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల దుర్మరణం
5లో..

ఆత్మీయ అనుబంధానికి ప్రతీక..రాఖీ



దండేపల్లి, ఆగస్టు 18: సోదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ నెల 19న సోమవారం రాఖీ పండుగ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. నువ్వు చల్లగా ఉండాలంటూ ఆడపడుచులు రాఖీ కట్టగా.. నీకు అండగా నేనున్నా అంటూ సోదరులు కట్నకానుకలు సమర్పించి, ఆశీర్వాదం తీసుకుంటారు. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముడు అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులతో రాఖీలు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

మార్కెట్లో రాఖీల గిరాకి జోరందుకుంది.

అన్నచెల్లెల అనుబంధాన్ని గుర్తు చేసే పండుగ రాఖీ. మార్కెట్‌లో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. సోమవారం రాఖీపౌర్ణమి సందర్భంగా వారం రోజుల నుంచే అమ్మకాలు సాగుతున్నాయి. మార్కెట్‌లో పది రూపాయల నుంచి మొదలు కొని వెయ్యి రూపాయల పైగా రాఖీలను విక్రయిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు అన్ని సైజ్‌లో విక్రయిస్తున్నారు. వెండి, బంగారు పుతాలతో ఉన్న రాఖీలు అయా డిజైన్‌లలో లభిస్తున్నాయి. సోదరులకు రాఖీ కట్టిన తరువాత నోరు తీపి చేయడానికి సోదరిమణులు స్వీట్లను కొనుగోలు చేస్తారు. వివిధ రకాల స్వీట్లు మార్కెట్‌లోని స్వీటు హౌజ్‌లలో వ్యాపారులు సిద్ధం చేశారు.

చిత్రం చెదరని జ్ఞాపకం..



దండేపల్లి, ఆగస్టు 18: తిరిగిరాని కాలాన్ని మధురమైన జ్ఞాపకాలను శాశ్వతంగా బంధించేదే ఫొటో. వివాహాలు, సన్మానాలు, సభలు, వినోదాలు, విషాదాలు ఇలా ఏదైనా గత అనుభవాలను గుర్తు చేస్తుంది. ప్రకృతి రమణీయ దృశ్యాలను పదిలం చేస్తుంది. 1839 ఆగస్టు 19న ఫ్రెంచ్ దేశస్థుడు జుక్‌క్రూయిస్ మండే డాగ్యురే వెండి పేట్లను లెన్స్‌లుగా ఉపయోగించి తొలి చిత్రాన్ని రూపొందించాడు. ఆనాటి నుంచి ఆగస్టు 19న ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ వస్తోంది. కాలానుగుణంగా ఫొటోగ్రఫీలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా ఫొటోగ్రఫీ వన్నెతగ్గలేదు. గత స్మృతులను నెమరు వేసుకొనేందుకు ఎంతో ఉపయోగమైనవి.

వివాదాస్పద భూములను జాయింట్ సర్వే చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్, గిరిజనులు

వేమనపల్లి, ఆగస్టు 18: గొర్లపల్లి, కాటేపల్లి, గెర్రగూడెం, చామనపల్లి గ్రామ శివార్లలో ఉన్న వివాదాస్పద భూములపై అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు జాయింట్ సర్వే చేయాలని ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, వేమనపల్లి మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్ అలీతో కలిసి గిరిజనులు వినతిపత్రం అందించారు. గ్రామాల శివార్లలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు లేకపోవడంతో అటవీ శాఖ అధికారులు సాగు చేస్తుంటే అడ్డుకుంటున్నారని తెలిపారు. గతంలో కొందరు గిరిజనులకు అప్పటి ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇచ్చినప్పటికీ బ్యాంకు అధికారులు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీఇచ్చినట్లు తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

హాజీపూర్, ఆగస్టు 18: రాంపూర్ సరస్వతి శిశుమందిర్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం వస్తున్నట్లు విద్యారణ్యం ఆవాస విద్యాలయ అధ్యక్షుడు వినయ్ ప్రకాష్‌రావు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో భవన సముదాయాల నిర్మాణానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, విద్యాభారతి దక్షిత మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సీతారాములు, విష్ణువర్ధన్ పాల్గొంటారని పేర్కొన్నారు. కోశాధికారి మల్రాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి



కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు

జైపూర్, ఆగస్టు 18: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. పీఆర్‌టీయూటీఎస్ మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా పత్తిపాక రాజన్న, ప్రధాన కార్యదర్శిగా అమరేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా రామ్మోహన్, మహిళ ఉపాధ్యక్షురాలుగా హైమావతి, కార్యదర్శిగా సంతోష్‌గౌడ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, జిల్లా గౌరవాధ్యక్షురాలు శాంకరి, రాసపెల్లి రవి పాల్గొన్నారు.

నేడు క్యాంపు కార్యాలయం ప్రారంభం

బెల్లంపల్లి, ఆగస్టు 18: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు క్యాంపు కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆదివాసీల సమస్యల సాధనకు పాదయాత్ర



ధర్ముకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీ పర్ధాన్ నాయకులు

ఏసీసీ, ఆగస్టు 18: ఆదివాసీల సమస్యల సాధనకు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి నుంచి హైద్రాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయానికి పాదయాత్ర చేస్తున్న పెందోర్ ధర్ము ఆదివారం మంచిర్యాలకు చేరుకున్నారు. ఆదివాసీ పర్ధాన్ సంఘం నాయకులు ఐబీ చౌరస్తాలో స్వాగతం పలికారు. ధర్ము మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ హక్కుల సాధన, పోడు భూముల సమస్య, ఆదివాసీ గిరిజనుల గూడాల అభివృద్ధి తదితర సమస్యలను సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు. ధర్ము అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రను కొనసాగించారు. సంఘం నాయకులు ధర్ముకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. మడావి శంకర్, జంగు, శ్రీనివాస్, తిరుపతి, ఉద్ధవ్ విలాస్ పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

మందమర్రిటౌన్, ఆగస్టు 18 : పట్టణంలోని 8వ వార్డులోని ప్రజలకు ఆదివారం సదాసేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సంగి సంతోష్ మొక్కలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు పది వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సభ్యులు జనార్దన్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు సమస్యల లోగిళ్లు

ఆంధ్రజ్యోతి విజిట్

- శిథిలావస్థలో గదులు, అరకొరగా మరుగుదొడ్లు
- మంచాలు లేక నేలపైనే నిద్ర
- వంట గదులు లేక అవస్థలు
- చెడిపోయిన ఆర్‌వో ప్లాంట్లు
- ఆరుబయట చన్నీటి స్నానాలు
- అపరిశుభ్రంగా పరిసరాలు



శిథిలావస్థకు చేరుకున్న బెల్లంపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్

ఏసీసీ, ఆగస్టు 18: పేద విద్యార్థులకు విద్యతో పాటు వసతి, ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. దశాబ్దాలుగా సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగుపడకపోగా పాలకుల చిన్న చూపు కారణంగా దిగజారుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు కొత్తగా సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలు

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు 8 ఉండగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు 5, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు బాలురు 5, బాలికలు 3 ఉన్నాయి. సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల, బీసీ వసతి గృహం, బాలికల పోస్టుమెట్రిక్ వసతి గృహం ఒక్కొక్కటి ఉన్నాయి. మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు బాలికలు 4, బాలురు 4, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, జూనియర్ కళాశాలలు 8, మోడల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 7, బీసీ హాస్టల్‌లు 2, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు 3, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలు 3, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు 2 మొత్తం 56 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో 10 వేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు.

శిథిల భవనాలు.. అరకొర వసతులు

జిల్లాలో దశాబ్దాల నుంచి నడుస్తున్న వసతి గృహాల్లో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరు కున్నాయి. బెల్లంపల్లిలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం, దండేపల్లి లోని ఎస్సీ బాలుర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎస్టీ పోస్టు మెట్రిక్ బాయ్స్ వసతి గృహం, భీమారం ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులూడి వర్షం పడితే ఉరుస్తోంది. దండేపల్లి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం అద్దెకు తీసుకున్న రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల, మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, గద్దెరాగడిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనంలో అరకొరవసతులు, చాలీచాలని గదులు తదితర సమస్యలు వేధిస్తున్నాయి. సొంత భవనాల్లోను గదులు సరిపోకపోవడం, తలుపులు, కిటికీలు ఊడి పోవడం, మరుగుదొడ్లు పాడై పోవడం, తలుపులు ఊడిపోయాయి. బాలుర వసతి గృహాల్లో స్నానపు గదులు లేక ఆరుబయట స్నానాలుచేయాల్సి వస్తోంది.

కనీస వసతులు కరువు

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు పడుకునేందుకు బెడ్లు లేక నేలపైనే పడుకుంటున్నారు. గదుల్లో ఫ్యాన్‌లు, సరిపడ లైట్లు కూడా లేవు. అనేక చోట్ల తాగునీటి శుద్ధి యంత్రాలు లేవు. కొన్ని చోట్ల ఉన్నా పని చేయడం లేదు. స్నానం చేసేందుకు వేడి నీరు అందించే వాటర్ హీటర్‌లు కూడా అందుబాటులో లేవు. మోడల్ స్కూల్, కేజీబీవీల్లో కొన్నింటిలో సోలార్ వాటర్ హీటర్‌లు ఉన్నప్పటికీ పాడైపోయి మరమ్మతులకు నోచుకోక విద్యార్థులు చన్నీళ్లతోనే స్నానం చేస్తున్నారు.

పరిసరాల్లో గడ్డి, పిచ్చిమొక్కలు

వసతి గృహాలు, గురుకుల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి పాములు, విష పురుగులు సంచరించినా కనబడని పరిస్థితి నెలకొంది. డ్రైనేజీలు సరిగ్గా లేక మురుగునీరు నిలిచి దోమలు, కీటకాలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో విద్యార్థులు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు.

సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు

జన్నారం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంటగది లేకపోవడంతో ఆరుబయట కవర్ల కింద వంట చేస్తున్నారు. బెల్లంపల్లి మండలంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పది గదులు ఉన్నా ప్రతీ గది పెచ్చులూడి వర్షం నీరు ఉరుస్తోంది. మినరల్ వాటర్ ప్లాంటు చెడిపోవడంతో విద్యార్థులు బోరు నీటిని తాగుతున్నారు. నెన్నెల మండలం కుష్నపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురుగునీరు నిలిచి దోమలు ప్రబలుతున్నాయి. వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కోటపల్లి మోడల్ స్కూల్‌లో ఆరు గదుల్లో ఐదు ఫ్యాన్‌లు చెడిపోయి ఉన్నాయి. చెన్నూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు కిటీకీలు లేక పోవడంతో విద్యార్థులు రాత్రి భయపడుతున్నాడు. హాస్టల్ వార్డెన్ చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుంటాడని విద్యార్థులు చెబుతున్నారు.



జన్నారం గిరిజన ఆశ్రమపాఠశాలలో పాలిథిన్ కవర్ల కింద వంట



కుష్నపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో గ్లాసులు లేక ప్లేట్లలోనే నీరు తాగుతున్న విద్యార్థులు



మంచిర్యాల ఎస్సీ బాలికల హాస్టల్లో పాడైపోయిన వాటర్ ప్లాంటు



కోటపల్లి మోడల్ పాఠశాలలో చెడిపోయిన సోలార్ వాటర్ హీటర్

భవనం కూలుతుందోనని భయపడుతున్నాం

రవికిరణ్, బెల్లంపల్లి ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థి



హాస్టల్ భవనం ఎప్పుడు కూలు తుందోనని భయంతో వణికిపోతున్నాం. వర్షాకాలం అయినం దున స్లాబ్‌లో నుంచి నీరు ఉరుస్తోంది. రాత్రి పూట భయంతో విద్యార్థులందరు ఒకే గదిలో నిద్రపోతున్నాం.

ఏసీపీ కార్యాలయంలో గొంతుకోసుకొని

కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

- పోలీసుల వేధింపులే కారణమంటూ కుటుంబసభ్యుల ఆరోపణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బేర సత్యనారాయణ

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 18: జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయం ఆవరణలో శనివారం మాజీ ఎంపీపీ, ప్రస్తుత నస్పూర్ మున్సిపాలిటీ 21వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో గల సర్వే నెంబర్ 14లోని భూమిలో నాలా పూడ్చి వేసి కబ్జాకు గురైందనే సమాచారంతో పరిశీలించేందుకు ఈ నెల 16న మున్సిపల్ కమిషనర్ సతీష్ వెళ్ళాడు. విధులకు అడ్డుపడటంతోపాటు కులం పేరుతో దూషించాడని సత్యనారాయణపై కమిషనర్ ఫిర్యాదు చేశాడు. విచారణ నిమిత్తం ఏసీపీ కార్యాలయానికి తీసుకురాగా ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టించారు : కౌన్సిలర్

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కావాలనే నన్ను టార్గెట్ చేసి నాపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించారు. మున్సిపల్ కమిషనర్‌ను కులం పేరుతో దూషించానని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. కమిషనర్ పరిశీలనకు వచ్చిన సమయంలో తాను స్థలం వద్దకు వెళ్ళలేదు. ఎమ్మెల్యే కావాలని కమిషనర్‌తో ఫిర్యాదు చేయించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారని, ఇదే భూమి విషయంలో శశికుమార్ అనే వ్యక్తిని దూషించానని కేసు పెట్టారన్నారు. నా ఫోన్ ట్రాప్ చేసి హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొన్నారని పేర్కొన్నారు. ఎలాంటి ఎంక్వైరీ లేకుండానే ఏసీపీ బెదిరింపులకు పాల్పడ్డాడని, ఎస్సై కూడా వేధింపులకు పాల్పడ్డాడని తెలిపారు.

వేధింపులే కారణం: కౌన్సిలర్ కుమార్తె మౌనిక



పోలీసులు కావాలనే వేధింపులకు పాల్పడి అక్రమ కేసులు బనాయించడంతోనే మా నాన్న ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. మున్సిపల్ కమిషనర్ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు. ఆ రోజు నాన్న ఇంట్లోనే ఉన్నారు. ఏసీపీ, ఎస్సైలు కావాలనే కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించారు.

విచారణలో భాగంగానే తీసుకువచ్చాం: ఏసీపీ ఆర్.ప్రకాష్



నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాలా కబ్జాకు గురైందంటూ పరిశీలనకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్‌తో బేర సత్యనారాయణ, బత్తుల శ్రీనివాస్, శ్రీహరిలు కులం పేరుతో దూషించడంతో కమిషనర్ ఫిర్యాదు మేరకు ఎస్సై సుగుణాకర్ సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. అందులో భాగంగా విచారణ నిమిత్తం పిలిపిద్దామని ప్రయత్నించగా రాలేదు. అతన్ని కార్యాలయానికి తీసుకువచ్చాం. కార్యాలయంలో కేక్‌ను కట్ చేసే కత్తితో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించాం. సత్యనారాయణపై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగానే పిలిపించాం. మేము కావాల్సుకొని కేసులు బనాయించామని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 18 : పట్టణంలోని గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాలలో 2003-2004లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు పీవీఎస్.చారి, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, వామనమూర్తి, భీంరావు, శ్రీనివాస్, మధూకర్‌లను సన్మానించారు. సుధమల్ల అశోక్ తేజ, సంతోష్, సంధ్యారాణి, సరిత, ప్రవళిక, రవి, అర్జున్, పున్నం, మజాహిద్, మనోహర్, రాయమల్లు, పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

హాజీపూర్, ఆగస్టు 18: మండల వ్యవసాయ విస్తరణ అధికారి కనకరాజు బదిలీపై మందమర్రికి వెళ్తున్న సందర్భంగా ఆదివారం ఆయనను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సింగిల్ విండో చైర్మన్ సత్తన్న, వైస్‌చైర్మన్ అంతయ్య, మహేందర్, భాగ్యమ్మతిరుపతి, ముకుందరెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

కాసిపేట, ఆగస్టు 18 : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు జనార్ధన్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం ధర్మారావుపేటలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ రాజీనామా పత్రాన్ని డీసీసీ అధ్యక్షురాలు సురేఖప్రేంసాగర్ రావుకు పంపినట్లు తెలిపారు. ఆరోగ్యం సహకరించక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

'పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేయాలి'

జన్నారం, ఆగస్టు 18 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, డైట్, బీఈడీకళాశాలల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం జన్నారంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 ప్రకారం ఉపాధ్యాయులందరు విద్యాశాఖలోని ఉన్నత స్థాయి పర్యవేక్షణ అధికారులుగా పదోన్నతులకు అర్హులని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు.

రాఖీలకు పెరిగిన గిరాకీ



మందమర్రిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మందమర్రిటౌన్, ఆగస్టు 18: రాఖీ పండగ నేపథ్యంలో ఆదివారం మందమర్రి మార్కెట్‌లో రాఖీల దుకాణాల వద్ద మహిళలు రాఖీలను కొనుగోలు చేశారు. దీంతో రాఖీలకు గిరాకీ పెరిగింది. ఆకర్షణీయమైన రాఖీలు యాజమానులు అందుబాటులోకి తేవడంతో కొనుగోళ్లు పెరిగాయి. అలాగే స్వీట్ల షాపుల ఎదుట రద్దీ నెలకొంది. మార్కెట్ సెంటర్ మహిళలతో సందడిగా మారింది.

ప్రశాంతంగా ముగిసిన పద్మశాలి సంఘం ఎన్నికలు



మంచిర్యాల: ఓటు హక్కును వినియోగించుకున్న కులస్తులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 18 : పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నికలు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కులస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు, పరిశీలకులుగా కామ రమేష్, గుండేటి యోగేశ్వర్, వెన్నం లక్ష్మీనారాయణలు వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెన్నూరు: చెన్నూరులోని పద్మశాలి భవనంలో ఆదివారం పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుల ఎన్నికలను నిర్వహించారు. పద్మశాలి కులస్తులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా బుర మల్లేష్, వల్లకాటి రాజ్‌కుమార్‌లు పోటీలో ఉన్నారు. మొత్తం 470మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 5గంటలవరకు 183మందిఓటుహక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి బండారి సతీస్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సరళిని గుండేటి యోగేశ్వర్, రమేష్, లక్ష్మీనారాయణలు పరిశీ లించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, పవన్‌కుమార్,వెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ

దండేపల్లి, ఆగస్టు 18: గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో రద్దీ పెరిగింది. ఉదయం నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. గూడెం ఆలయప్రాంతమంతా భక్తులతో సందడి నెలకొంది.

సత్యదేవున్ని దర్శించుకున్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ఆదివారం గూడెం సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. అధికారులు, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ఆశీర్వచనం అందించారు.

రాజకీయ సమన్యాయంతోనే అన్ని కులాల అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 18: అన్ని కులాలకు రాజకీయంగా సమన్యాయం జరిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని రాజకీయ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని తెలిపారు. ఆదివారం సాయిమిత్ర గార్డెన్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాజకీయ సమన్యాయం చర్చ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో మెజార్టీ కులాలను రాజకీయంగా ఎదగకుండా అగ్రకులాలు అణిచివేస్తున్నాయన్నారు. పది శాతం లేని వారు దేశంలో రాజకీయ అధికారంలో ఉంటున్నారని, 80 శాతం ఉన్న వారు దూరంగా ఉంటున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటాలు చేయాలన్నారు. మెజార్టీ కులాలకు రాజ్యాధికారం రావాలనే చర్చ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లి సత్యనారాయణ, అందుగుల శ్రీనివాస్, శ్రీనివాస్, ముల్కల రాజేంద్ర ప్రసాద్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, గాజుల ప్రతాప్, బండారి సత్యనారాయణ, నరేష్, పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

జన్నారం, ఆగస్టు 18 : ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం రేండ్లగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో రూ.1.95 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. సబ్బండ వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు.

రాజ్‌గోండు సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా హన్మంతు



కాసిపేట, ఆగస్టు 18: రాజ్‌గోండు సేవా సమితి జిల్లా ప్రధాన కార్య దర్శిగా కాసిపేట మండలానికి చెందిన పెందూర్ హన్మంతు నియమితులయ్యారు. ఆదివారం ఉట్నూరు గుస్సాడీ గుట్టలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ హన్మంతుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

గోదావరి నదిలో మునిగి
ఇద్దరు యువకుల దుర్మరణం



అల్లాటి అజయ్, గంధం చరణ్ (ఫైల్)

దండేపల్లి, ఆగస్టు 18: దండేపల్లి మండలం ద్వారక సమీపంలోని గోదావరిలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. కొండాపూర్ గ్రామానికి చెందిన అల్లాటి అజయ్(19), గంధం చరణ్ (17)లు ఓ మతానికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా మత పెద్దలు, కుటుంబసభ్యులతో కలిసి ద్వారక సమీపంలోని గోదావరి నదిలో స్నానం చేసేందుకు వచ్చారు. నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదశాత్తు నీటిలో మునిగారు. గజ ఈతగాళ్లు గాలించగా అజయ్, చరణ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు. చరణ్ ఇంటర్ పూర్తి చేసి బీటెక్ కౌన్సెలింగ్ హాజరయ్యాడు. తల్లి వసంత, సోదరి ఉన్నారు. అజయ్ ఐటీఐ పూర్తిచేయగా ఇద్దరు అక్కలు ఉన్నారు.



సర్వే కష్టాలు

- జిల్లాలో వేధిస్తున్న సర్వేయర్లు, సిబ్బంది కొరత
- వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు
- భూముల సర్వేకు ఇబ్బందులు పడుతున్న రైతులు

బెల్లంపల్లి, ఆగస్టు 18: జిల్లాలో ల్యాండ్ సర్వేయర్ల కొరత వేధిస్తోంది. పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాల రీత్యా జిల్లాలో భూముల క్రయవిక్రయాలు భారీగా పెరిగాయి. దీంతో పాటు భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో భూ వివాదాలు నెలకొని ఘర్షణలకు దారి తీస్తున్నాయి. గజం స్థలానికి సైతం గొడవలు పడి రెవెన్యూ, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. భూముల కొలతల్లో వచ్చే తేడాలను గుర్తించి సరి చేసేందుకు సర్వేయర్లు అవసరం. భూముల కొలతల కోసం రైతులు దరఖాస్తులు చేసుకుని ఫీజు చెల్లించి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సర్వేయర్ల కొరత రైతులకు శాపంగా మారింది.

-వేధిస్తున్న సర్వేయర్ల కొరత

జిల్లాలో మొత్తం 18 మండలాలు ఉండగా జిల్లా కేంద్రం మినహాయించి మండలానికి ఒక్కరు చొప్పున సర్వేయర్‌ను నియమించాల్సి ఉంది. 18 మండలాలకు కేవలం 11 మంది సర్వేయర్లు మాత్రమే ఉండడంతో కొలతల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు డివిజన్ సర్వేయర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్క డివిజన్ సర్వే అధికారి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల డివిజన్ సర్వే అధికారిగా పోస్టింగ్ ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఇక్కడ ఎవరిని నియమించలేదు. జిల్లా కేంద్రంలో ఇద్దరు సర్వేయర్లు, ముగ్గురు డిప్యూటీ సర్వేయర్లు ఉండాల్సి ఉండగా ఇప్పటి వరకు నియమించలేదు. 7 మండలాలకు సర్వేయర్లు లేకపోవడంతో ఇతర మండలాల సర్వేయర్లు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి వేచి చూడలేక కొందరు రైతులు ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు.

-వందల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు

ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత దస్త్రాలు, భూముల కొలతల్లో వ్యత్యాసాలు వస్తున్నాయి. కొందరికి రికార్డుల్లో భూమి ఎక్కువగా ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే భూమి విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. మరికొందరికి భూమి తక్కువగా ఉంటే రికార్డుల్లో ఎక్కువ చూపిస్తోంది. ఫలితంగా రైతులు మధ్య వివాదాలు ప్రారంభమై ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా భూములు కొనుగోలు చేసే సమయంలో హద్దుల విషయంలో ఇబ్బందులు ఎదురు కావద్దని సర్వే కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. భూ కొలతల అధికారులకు అర్జీలు అందిస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజు చెల్లించి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడీ పరిధిలో 7 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మంచిర్యాల డివిజన్ డీఐ పరిధిలో 46, బెల్లంపల్లి డివిజన్ డీఐ పరిధిలో 25, మంచిర్యాల పట్టణంలోని డీఐ పరిధిలో 12 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలోని 18 మండలాల్లో 612 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులు కొన్ని నెలలు గా పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులు చేసుకున్న తర్వాత 45 రోజుల వ్యవధిలో భూముల కొలతలు చేపట్టాలనే నిబంధనలు ఉన్నప్పటికీ సర్వేయర్ల కొరతతో పనులు జరగడం లేదు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎన్నాళ్లు పడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. కొందరు సర్వేయర్లు కాసులు ఇస్తేనే సర్వే చేస్తున్నారు. లేదంటే నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది.గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు దరఖాస్తులు చేసుకుని సర్వేయర్లు వస్తారనే ఆశతో నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా భూములు స్థలాలు సర్వే చేసిన తర్వాత అధికారులు జారీ చేసే నివేదిక ఇచ్చే సమయంలో సైతం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ నివేదికలో భూమి పూర్తి వివరాలు, హద్దులు, విస్తీర్ణం తదితర సమాచారం ఉంటుంది. వీటి జారీలోను జాప్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజాప్రతినిదుల ఒత్తిళ్ల పైరవీలతో భూములను సర్వే చేయించుకుంటున్నారు. రైతులు మాత్రం నెలల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది.

ఏడు నెలలుగా ఎదురు చూస్తున్నా

- మాధవరావు , బెల్లంపల్లి



తాళ్లగురిజాల శివారులో ఆరు ఎకరాల పొలం ఉం ది. ఇందులో 16 గుంటలు తక్కువగా వస్తుంది. దీంతో సర్వే కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాను. ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు సర్వేయర్ రాలే దు. భూమి కొలత వేయలేదు. నా భూమి తక్కువగా ఉండడంతో పక్క పొలం రైతులతో మాట్లాడుతున్న క్రమంలో ఘర్షణకు దారి తీస్తుంది. సకాలంలో భూముల కొలతలను చేపడితే రైతులకు ఇబ్బంది ఉండదు.

ప్రైవేటు సర్వేయర్‌తో చేయించా

- కిరణ్‌కుమార్ , మందమర్రి



భూమి కొలతల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వ సర్వేయర్ రాలేదు. దీంతో ప్రైవేటు సర్వే యర్‌తో భూమి హద్దుల సర్వే చేయించుకున్నాను. ప్రైవేటు సర్వేయర్‌లతో ఇష్టరీతిన భూముల కొలతలు చేపడుతున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. భూమి కొలతల కోసం ప్రభుత్వ సర్వేయర్లను సంప్రదిస్తే చిన్న చిన్న కారణాలు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు 18: జన్నారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం కావాలని పోరాడిన యోధుడు బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు.

దండేపల్లి: తెలంగాణ వీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అని మండల గౌడ సంఘం అధ్యక్షుడు బండి రవిగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ జయంతిని దండేపల్లిలో నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవిగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

కోటపల్లి: సర్వాయి పాపన్న జయంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. మోకుదెబ్బ మండల అధ్యక్షుడు ముత్యాల సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమా ర్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేశ్వర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, శంకర్‌గౌడ్, అంజాగౌడ్, సత్యగౌడ్, పాల్గొన్నారు.

కాసిపేట: కొండాపూర్ యాప వద్ద బహుజన పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మోకుదెబ్బ గౌడ సంఘం, ప్రజాసంఘాల నాయ కులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మార్క శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్యగౌడ్, బుగ్గయ్యగౌడ్, దుర్గయ్య, విద్యాసాగర్, రాజగౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ రైల్వే గేటు సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకయ్యగౌడ్, నర్సగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్, రాజగౌడ్, భాస్కర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

హత్యాచార నిందితులను ఉరితీయాలి



సీసీసీ కార్నర్ వద్ద రాస్తారోకో చేస్తున్న మహిళలు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 18: కలకత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార నిందితులను ఉరి తీయాలని ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్, ఆరంభ ట్రస్ట్, సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిందితులకు ఉరి శిక్ష విధించాలన్నారు. మహిళా ఉద్యోగులపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిరణ్, శ్రీనాథ్, శంకర్ యువకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ట్రైనీ వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లిసాగర్ యాదవ్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితులను ఉరి తీయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ప్రశాంత్, రాకేష్, రాజు, గణేష్, వంశీ, సురేష్ పాల్గొన్నారు.

నెన్నెల: కలకత్తాలోని ఆర్జీ కర్ ఆసుపత్రి ట్రైనీ వైద్యురాలి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్ఎంపీలు డిమాండ్ చేశారు. కుశ్నపల్లి ఎక్స్ రోడ్ నుంచి బస్టాండ్ మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళల రక్షణ కోసం కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. పురుషోత్తం, నరేష్, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

నస్పూర్: కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద మహిళలు రాస్తారోకో చేశారు. మృతురాలి ఆత్మకు చేకూరాలని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ, నాయకులు జంజిరాల ఉమా, కాలి విజయలక్ష్మి, రమాదేవి, సమ్మక్క, మౌనిక, శాలిని, నాగమణి, లత, పాల్గొన్నారు.



మంచిర్యాలలో యువకుల ర్యాలీ

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



కౌటాలలో నివాళులు అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కౌటాల, ఆగస్టు 18: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, అభివృద్ధి కోసం జమిందారులు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా పోరాటంచేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథ్, మాజీసర్పంచ్ మౌనీష్, తిరుపతి, గోపాల్, గౌడ సంఘం నాయకులు సత్యనారాయణగౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, వినోద్‌గౌడ్, సాయిచరణ్‌గౌడ్, గణేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్‌లో చేరాను

సిర్పూర్(టి), ఆగస్టు 18: కాంగ్రెస్ ప్రభుత్వంచేస్తున్న పనులకు ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరినట్లు మాజీజడ్పీటీసీ అజ్మీరారాంనాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్‌అండ్‌బీఅతిథిగృహంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలు అమలుచేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట నాయకులు తిరుపతి, వికలాంగుల సంఘం నాయకులు రవిశంకర్ ఉన్నారు.

పిడుగుపాటుతో రైతు మృతి

పెంచికలపేట, ఆగస్టు 18: మండలంలో ఎల్లూరు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుతో ఓ రైతు మృతిచెందాడు. ఎస్సై కొమురయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్(46) అనే రైతు తనపొలంలో వరినాట్లు వేయడానికివెళ్లాడు. మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో భారీవర్షంతోపాటు పిడుగుపడడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనస్థలాన్ని ఎస్సై కొమురయ్య సందర్శించి కేసునమోదు చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం



మొక్కలను నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18: ఆసిఫాబాద్ శివారులోని లయన్స్‌క్లబ్ కార్యదర్శి కాండ్రె విశాల్ స్థలంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 45పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు శంకర్, ఉబెదీన్ యాహియా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

కాగజ్‌నగర్, ఆగస్టు 18: కాగజ్‌నగర్ ఎలక్ట్రిక్ పవర్‌హౌజ్ ట్రాన్స్‌ఫార్మర్ షెడ్‌లో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే సిబ్బంది, కాలనీ వాసులు తెరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అం దించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందన్న కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు. అగ్నిమాపక అధికారి భీమయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ విజయ్ సిబ్బంది హర్షద్ మంటలను ఆర్పారు.

జిల్లాలో పలు మండలాల్లో భారీవర్షం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/సిర్పూర్(టి)/దహెగాం/లింగాపూర్, ఆగస్టు 18: జిల్లాలో ఆదివారం పలుమండలాల్లో భారీవర్షం కురిసింది. సిర్పూర్(టి), దహెగాం, పెంచికలపేట, బెజ్జూరు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. కాగా ఉదయం నుంచి ఎండవేడిమి అధికంగా ఉండటంతో వర్షం కాస్తా ఊరటనిచ్చినట్లయింది. సిర్పూర్(టి)లో కురిసిన వర్షానికి కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై వెంపల్లి వద్ద వరదనీరు ప్రవహించడంతో అరగంటపాటు రాకపోకలు స్తంభించాయి. దహెగాం మండలంలో కురిసిన భారీవర్షానికి రోడ్లన్నీ వరదనీటితో నిండిపోయాయి. లింగాపూర్ మండల కేంద్రంతోపాటు మండలంలోని జాముల్‌ధర, కిమానాయక్ తండా, లోద్దిగూడా ప్రాంతాల్లో ఉన్నవాగులు ఉప్పొంగడంతో ఆ ప్రాంతప్రజలు వాగు లుదాటేందుకు ఇబ్బందిపడ్డారు. ఆసిఫాబాద్ మండలం కురిసిన వర్షానికి వట్టివాగు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరడంతో రెండుగేట్లు ఎత్తినీటిని కిందికి వదులుతున్నారు. అలాగే కుమరంభీం ప్రాజెక్టు ఒకగేటు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు.



కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం



సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



లింగాపూర్: జాముల్‌ధర వాగు వద్ద వేచి చూస్తున్న ప్రజలు



లింగాపూర్: కిమానాయక్‌తండా వద్ద వాగు దాటుతున్న ప్రజలు

వసతులిలా.. చదువులు సాగేదెలా?

● చిన్నపాటి వర్షానికే తడిసిపోతున్న తరగతి గదులు ● సమస్యల వలయంలో రెబ్బెన ఆశ్రమపాఠశాల



రెబ్బెన ఆశ్రమ పాఠశాలలో నిలిచిన వర్షం నీరు



వర్షాలకు ఊడిన స్లాబు పెచ్చులు

రెబ్బెన, ఆగస్టు 18: మండల ఆశ్రమ పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చిన్నపాటి వర్షం కురిస్తే తరగతి గదుల తడిసిపోతున్నాయి. అలాగే పైపెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసినపుడు పాఠశాల ఆవరణలో వర్షంనీరు నిలుస్తోంది. వర్షాకాలంలో పాఠశాలకు రావాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఉంది. చదువుకుందామంటే కూర్చునేందుకు వీలులేని పరిస్థితి ఉంది. బెంచీలు తడిసిపోతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కూడా సంక్రమంగా పనిచేయటం లేదు. పాఠశాలలో ఉన్న విద్యుత్‌బోర్డులు పూర్తిగా పగిలిపోయాయి. ఇన్ని సమస్యలు రాజ్యమేలుతున్నా అధికారులు స్పందించకపోవటంతో దారుణమని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చూడాలని అంతా కోరుతున్నారు.

సమస్యలు రాజ్యమేలుతున్నాయి..

-నవీన్ కుమార్, రెబ్బెన



ఆశ్రమ పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వర్షాలతో ఇబ్బంది పడుతున్నాం. పాఠశాల ప్రాంగణంలో వర్షంనీరు నిలుస్తోంది. పాఠశాలలోని బెంచీలు తడిసిపోతున్నాయి. పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. భయం భయంగా చదువులు సాగాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

వసతులు సక్రమంగా లేవు..

-జి అర్జున్, రెబ్బెన



ఆశ్రమ పాఠశాలలో వసతులు సక్రమంగాలేవు. విద్యుత్ బోర్డులు ఎక్కడికక్కడే చెడిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. తరగతిలోకి వెలుతురు సక్రమంగా రావటం లేదు. ఫ్యాన్లు కూడా పని చేయటం లేదు. వర్షాలతో పడరానిపాట్లు పడుతున్నాం. ఉన్నతాధికారులు వెంటనే పాఠశాలను పర్యవేక్షించి సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

రెబ్బెన, ఆగస్టు 18: యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని తహసీల్దార్ రాంమోహన్‌రావు తెలిపారు. ఆదివారం రాష్ట్రస్థాయి యోగాపోటీల ఎంపిక కార్యక్రమం సీఈఆర్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాచేయటం వల్ల మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. జిల్లా యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసరి అంజనేయులు గౌడ్, కార్యదర్శి కొలిపాకకిరణ్, జాయింట్ సెక్రెటరీ, కేసరి అలేఖ్య మాట్లాడుతూ ఈపోటీల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, స్టేట్‌అబ్జర్వర్ మండల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్, ఎంఆర్ఐ ప్రేంకుమార్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎస్ లక్ష్మి, నవీన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అదుప్పి తప్పి కారు బోల్తా

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 18: మండలంలోని రేపల్లెవాడ మూలమలుపువద్ద ఆదివారం కారు అదుపు తప్పి విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని బోల్తాపడింది. అచ్చలాపూర్ నుంచి కారు నడుపుతూ దేవానంద్ అనేవ్యక్తి రేపల్లెవాడవైపు వెళ్తుండగా కారు మూలమలుపు వద్ద అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. దీంతో దేవానంద్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికిచేరుకుని గాయాలైన వ్యక్తిని అంబులె న్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కారు వేగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో విద్యుత్‌స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ నేల మట్ట మైంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.

బంజారా సంస్కృతికి ప్రతిబింబం తీజ్

● పెళ్లి కాని యువతులు జరుపుకునే సంబురం
● తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో సందడి ● ఆచార వ్యవహారాలే ప్రాణం
● మండలంలో నేటి నుంచే శ్రావణం తీజ్ సందడి



లింగాపూర్, ఆగస్టు 18: పచ్చని అటవీ ప్రాంతాల్లో పకృతి ఒడిలో సాంప్రదాయాలు, ఆచారవ్యవహారాలకు ప్రాణం ఇచ్చే గిరిజనులు ఆగస్టులో శ్రావణం నెల చివరివరకు జరిగే తీజ్‌సంబరాలు నేటితో మొదలు కానున్నాయి. లింగాపూర్ మండలంలోని బంజార తండాలలైన లింగాపూర్, పిక్లాతండా, కొత్తపల్లి, వంకమద్ది, మెతిపట్టార్, రామునాయక్ తండా, గోపాల్‌పూర్, పూల్‌సింగ్‌తండా, దంపూర్, కిమానాయక్ తండా, తదితర తండాల్లో శ్రావణంలో ప్రతిరోజు తీజ్ పండుగను జరుపుకుంటారు. దీంతో శ్రావణమాసం మొత్తం తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. సీత్లా, తీజ్ జనసమూహంలో ఉండే నమ్మకాలు సాంప్రదాయాలను ఇప్పటికీ గిరిజనులు ఆచరిస్తున్నారు. గిరిజనుల పండుగల్లో తీజ్ ఉత్సవాలు ముఖ్యమై నవి. వర్షాలు మొదలవడంతోనే లంబాడీలు శీతల్, తీజ్ ఉత్సవాలు జరుపుకుంటారు.

బతుకమ్మ పండుగ తరహాలోనే సాగిపోయే తీజ్ ఉత్సవాలు వారి సాంప్రదాయాలకు అద్దం పడుతాయి. లంబాడీలు తమ భాష, ఆచార వ్యవహారాలను సజీవంగా ఉంచుకోవడానికి తపన పడుతూనే ఉంటారు. చదువుకుంటున్న యువతుల విషయంలో వస్త్రాధరణ విషయంలో కొంతమేరకు మార్పులు వచ్చినా ఆచార వ్యవహారాలు, పండుగల్లో మాత్రం పాటిస్తున్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో లంబాడి మహిళలు కట్టుబొట్టు విషయంలో పద్ధతులు మాత్రం వీడడం లేదు. ఇప్పటీ వృద్ధులు రంగురంగుల బట్టలతో లంగా జాకెట్లను కుట్టుకొని వాటిపై అద్దాలను ఏర్పాటు చేసుకుంటా రు. మణికట్టు మోచేతి భాగం వరకు పింగాని గాజులు ధరిస్తున్నారు. ఇప్పటికీ మెడకు వెండితో చేసిన పెద్దవిగా ఉండే హాసలి ధరించడం కనిపిస్తునే ఉంటుంది. ఇలా ఆచార వ్యవహారాలను ఆరాధించే లంబాడీలు, బంజారాలు వ్యవసాయ పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

బతుకమ్మ తరహాలోనే తీజ్ ఉత్సవం..

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండు గలాగే తీజ్ పండుగను జరుపుకుంటారు. తీజ్ అంటే పచ్చని పంట లేదా నారు అని అర్థం. తీజ్ బంజారాల మాతృదేవత మేరామాకు ప్రతిరూపంగా విశ్వసిస్తారు. బంజారాల సంస్కృతిలో ఏడు గురు మాతృదేవతలు ఉంటారు. వారిలో మేరా పెద్దది. ఆమె పైరు పంటలను రక్షిస్తుందని వర్షాలు కురిసి వేసిన పంటలు పుష్కలంగా పండి ధాన్యం ఇంటికి వచ్చేలా చేస్తుందని భావిస్తారు. పచ్చని నారును మేరమా రూపంగా మలిచి పండుగగా జరుపుకుంటారు. తొలకరి చినుకులు కురిసిన తరువాత తండా ప్రజలు అదును చూసి విత్తనాలు వేస్తారు. పచ్చగా పెరుగుతున్న పంటను చూసి తండా ప్రజలు తీజ్ ఉత్సవాన్ని జరుపుతారు. పంట ఏపుగా పెరిగే నాటికి జూలై చివరి ఆగస్టు మాసం చివరి వరకు ఈ పండుగ నిర్వహిస్తారు. బంజారాలు భూమిని పంటను దేవతా రూపంగానే భావిస్తారు. తండా పెద్ద అనుమతితో ముత్తైదువలు సూత్రదారులుగా బంజార యువతులతో పండుగ నిర్వహిస్తారు.

నాలుగు దశల్లో పండుగలు..

తొమ్మిది రోజులు నాలుగు దశలుగా పండుగను నిర్వహి స్తారు. మొదటిది బుట్టలలో గోదుమలను చల్లుతారు. దీన్ని తీజ్ బోరా యేరో అంటారు. రెండవది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం. మూడవది గణ్‌గోర్ అంటే మేరామా సేవాలాల్‌ల పెళ్లి. నాలుగవది గోదుమ నారును చెరువులో వదులడం. దీనిని వేరా యేరోగా పిలుస్తారు. బంజారా యువతులు గోదుమలు కొని సారవంతమైన మట్టిని తీసుకొచ్చి బావి దగ్గర ఉంచి శుభ్రమైన నీటిని తెచ్చి పాటలు పాడుకుంటూ గోదుమలను నానబెడుతారు.

పెద్దలు తీజ్ బుట్టలను తయారు చేసి ఇస్తారు. గోదుమలు నానబెట్టి వాటిని బుట్టల్లో వేసి అమ్మాయిలు నృత్యాలు, పాటలు పాడుతారు. అమ్మాయిలు గోదుమలు నానబెట్టి బుట్టలు వేసే పనిలో ఉంటే వారి అన్నదమ్ములు మంచె వేస్తారు. కింద ఉంటే నారును పశువులు తింటాయని ఎత్తుగా ఈ మంచె తయారు చేస్తారు. పెద్ద బుట్టను ఒక దాన్ని ఏర్పాటు చేసి మిగిలినవి చిన్న బుట్టలను ఉంచుతారు. నారు ఏపుగా పెరగడానికి ఉదయం మధ్యాహ్నం సాయంత్రం క్రమం తప్పకుండా నీళ్ల పోస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీళ్ల పోసే సమయంలో పాటలు పాడుతారు.

ఉప్పు కారం లేని ఆహారం..

తీజ్ బుట్టల తయారీ నుంచి గోదుమ నారును చెరువులో వదిలే వరకు అమ్మాయిలు ఉప్పు, కారం లేని ఆహారాన్ని భుజిస్తూ దీక్షగా ఉంటారు. బంజారాలు రోజంతా వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం వేల తీజ్ దగ్గరకు చేరి పాటలు పాడడం నృత్యాలు చేయడం చేస్తారు. వారు పాడే పాటల్లో భక్తిపారవశ్యం కనిపిస్తుంది. 7వరోజున సేవాలాల్‌కు శాఖహార నైవేద్యాన్ని సమర్పిస్తే మేరామా దేవత మాంసాహార నైవేద్యాన్ని స్వీకరిస్తుంది. ప్రతి కుటుంబం కొంచం బియ్యం పిండిని దీక్షలో ఉన్న అమ్మాయిలకు పంపిస్తారు. పిండి, బెల్లం కలిపి అమ్మాయిలు తీజ్ దగ్గరే నైవేద్యా న్ని తయారు చేస్తారు. దీన్ని బుజ్జా లాప్సీ అంటారు. ఈ పదార్థాన్ని నెయ్యితో కలిపి మంటలో వేస్తారు. బియ్యం పిండితో రొట్టె చేసి బెల్లంతో కలిపి ముద్దచేస్తారు. దీన్ని చుర్మో అంటారు. మేరామా సేవాలాల్ పెళ్లి 9వరోజు ఘనంగా జరుపుతారు.

గణ్ అంటే భార్య గోర్ అంటే భర్త గణ్‌గోర్ ఉత్సవంగా జరుపుతారు. సాంప్రదాయంగా అలంకరించి పెళ్లి జరిపిస్తారు. దేవతలకు నైవేద్యం సమర్పించ గానే మంచెమీద ఉన్న బుట్టలను అన్నదమ్ములు తీసుకొని పరుగు తీస్తారు. వారివెంట అక్కా చెల్లెల్లు అన్న దమ్ము లు కూడా పరుగు తీస్తారు. బుట్టలోని నారు ఏమీ చెయ్యవద్దని తమకు ఇవ్వమంటూ వేడు కునే కార్యక్రమం నిర్వహిస్తారు. దేవతకు ప్రతిరూపాలైన చిన్నబుట్టలను చిందర వందర చేస్తే శోకభరిత గీతాలను ఆలపిస్తారు. ఇలా అనేక విధాలుగా ఉత్సవాన్ని కొనసాగిస్తారు.

తొమ్మిదవ రోజున గోదుమ నారును చెరువులో వదులుతారు. చిన్నపీట మీద అన్న దమ్ములు అక్కచెళ్లల్ల కాళ్ల కగిడి తమ ప్రేమానురాగాలను ప్రకటిస్తారు. అన్నదమ్ములు, అక్కా చెళ్లెళ్లకు అనుబంధంగా పాటలు పాడుకుంటారు. తీజ్‌ఉత్సవంలో పాల్గొనే అమ్మా యిలకు మంచి భర్తలు వస్తారని మంచి కాపురం ఉంటుం దని కూడా భావిస్తారు.


గోదుమలు చల్లిన మట్టి బుట్టలు

ఆగని ఇసుక అక్రమ దందా

● నిబంధనలు బేఖాతరు
● 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు


కాగజ్‌నగర్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 18: కాగజ్‌నగర్‌లో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిబంధనలు బేఖాతరు చేస్తూ పెద్దవాగు, రాస్పెల్లి వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా దారులు రేయింబవళ్లు ఇసుకను వాగు నుంచి తరలిస్తున్నారు. పెద్దవాగు, రాస్పెల్లి ఇతర వాగుల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకే తోడుకునేందుకు అనుమతి ఉంటుంది. వేబిల్లును ఒక్క ట్రిప్పు మాత్రమే తరలించేందుకు వినియోగించాల్సి ఉంటుంది. అయితే ఒకటి కాకుండా అనేక ట్రిప్పులు రవాణా చేస్తున్నాట్లు తెలుస్తోంది. దీనిపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు నిఘా పెట్టాల్సి ఉంటుంది. ఓ పద్ధతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భ నీటిమట్టం తగ్గే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వాగుల్లోంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఒక ప్రాంతంలో డంప్ చేసి అక్కడినుంచి పెద్దపెద్ద లారీల ద్వారా రాత్రిళ్లు కాగజ్‌నగర్ మీదుగా హైదరాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియలో కిందిస్థాయి నుంచిపైస్థాయి అధికారుల వరకు ముడుపులందుతునట్టు ఆరోపనలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమరవాణా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇక్కడి కొంతమంది అధికారుల తప్పిదాలతో వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అడపాదడపా ఫిర్యాదులతో ఒకటి, రెండు వాహనాలను పట్టుకొంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఒక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన నిముషాల్లోనే విడిచిపెట్టడమే ఇందుకు నిదర్శనంగా భావించవచ్చు. జిల్లా అధికారులు గట్టి చర్యలు తీసుకుంటేనే ఈ ఇసుక అక్రమ రవాణాకు చెక్‌పెట్టే అవకాశాలున్నాయి పలువులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా విషయంలో పలుమార్లు తనిఖీలు చేసిన కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనల ప్రకారం ఇసుక తరలించాలని సూచిస్తున్నామన్నారు. నిబంధనలు పాటించకుంటే తప్పకుండా కేసులు నమోదు చేస్తాం.

ప్రాజెక్టుల్లోకి వస్తున్న వరదనీరు

● కుమరం భీం, వట్టివాగు గేట్ల ఎత్తివేత


వట్టివాగు నుంచి కిందికి ప్రవహిస్తున్న నీరు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18: ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు గేట్లను ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 243మీటర్లు కాగా 237మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు లోకి 813క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఒకగేటు ఎత్తి 431క్యూసెక్కుల వరదనీటిని బయటకు వదులుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 239.5మీటర్లు కాగా 238.5 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 840క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో రెండు గేట్లు ఎత్తి 720క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. దీంతో కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టు పరివాహకప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంజ నీరింగ్ అధికారులు సూచించారు.

ఐక్యంగా కదిలినప్పుడే సమన్యాయం సాధ్యం

● ఎన్పీజేఎఫ్ చైర్మన్ వీజీఆర్ నారగోని


సమావేశంలో మాట్లాడుతున్న నారగోని

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 18: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఐక్యంగా కదిలినప్పుడే సమన్యాయం సాధ్యమవు తుందని నేషనల్ పొలిటికల్ జస్టిక్ ఫ్రంట్ (ఎన్పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో ఎన్పీజెఎఫ్ జిల్లా కన్వీనర్ రమేష్ అధ్యక్షతన అన్ని కులాల ప్రతినిదులతో నిర్వహించిన సమన్యాయంపై చర్చ కార్యక్రమానికి కన్వీనర్లు నర్సయ్య, లక్ష్మణ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలన్నీ కూడా బూర్జవ పార్టీలని ఆరోపించారు. రాజీయ పార్టీల వద్దకు సాయం కోసం ఏ వర్గం ప్రజలు, నాయకులు వెళ్లవద్దన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఒక్క తాటిపైకి రావాలన్నారు. దీనికి అన్ని వర్గాలు కలిసి నేషనల్ డెమక్రటిక్ ఫ్రంట్ పేరుతో పార్టీ ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో పాల్గొనేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఆంజనేయులుగౌడ్, ఉపేందర్, నారాయణ, మారుతి, శంకర్, వెంకన్న, ప్రహ్లద్, మధుకర్,మల్లయ్య, దివాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కివస్తున్న శ్యాంరావు కేసు

● మృతదేహంపై ఏడుచోట్ల గాయాలు?

కాగజ్‌నగర్, ఆగస్టు 18: కాగజ్‌నగర్ మండలం బురదగూడకు చెందిన కొట్రంగి శ్యాంరావు(36) మృతి చెందిన వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. రీపోస్టుమార్టంలో మృతదేహాన్ని భౌతికంగా పరిశీలించగా పలు చోట్ల గాయాలున్నట్టు సమాచారం. అలాగే గొంతునులిమి ఉన్నట్టు, వీపు భాగంలో పిడిగుద్దులు గుద్దటంతో రక్తం గడ్డం కట్టినట్టు నిర్ధారించారు. రెండు అరికాళ్ల మధ్య వస్తువుతో గాయపర్చినట్టు తేలింది. వీటితోపాటు పక్కటెముకలు పూర్తిగా విరిగిపోయినట్టు సమాచారం.

రిపోర్టుల మధ్య తేడా..

మొదటి పోస్టుమార్టం రిపోర్టుకు, రీ పోస్టు మార్టంలోని అంశాలకు చాలాతేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ కేసులో భారీగా ముడుపులు అంద టంతో ఈ తతంగం జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో పోలీసుల పాత్రపైనే అనుమానాలు వస్తుండటంతో కంచే చేను మేసినట్లయిందని పలువురు పేర్కొంటున్నారు. బురదగూడకు చెందిన ఇద్దరు వ్యక్తులు, పోలీసు డిపార్టుమెంటులో ముగ్గురు వ్యక్తులు కలిసి కేసును దారి మళ్లించి ఈ వ్యవహారం నడిపినట్టు తెలుస్తోంది. ఈ కేసులో అప్పుడు విచారణ చేపట్టిన ఎస్సై సోనియా విచారణను తప్పు దారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి.

సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నాం..

-అల్లం రాంబాబు, సీఐ, కాగజ్‌నగర్

కొట్రంగి శ్యాంరావు మృతి కేసులో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నాం. త్వరలోనే ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం: కలెక్టర్

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18: మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన నిర్వహించిన సర్దార్‌సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొగల్‌బహదూర్ చేస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటను గడగడలాడించిన వీరుడు తొలి దశ విప్లవకారుడు సర్దార్ పాన్నగౌడ్ అని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బీసీలు ముందుకు సాగాలన్నారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్, సంఘం నాయకులు సుదర్శణ్‌గౌడ్, అనీల్‌గౌడ్, జగ్గాగౌడ్, కర్ణాగౌడ్, ఆంజనేయులుగౌడ్, మనోహర్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, తదితరులు

రోడ్డుకు మరమ్మతులు

దహెగాం, ఆగస్టు 18: మండలకేంద్రం నుంచి కల్వాడకు వెళ్లేబీటీరోడ్డు నల్ల చెరువు వద్ద పాడైపోయింది. దీంతో మండలంలోని యువత రహదారిపై బురద గుంతల్లో కంకరను పోసి చదును చేయించారు. కాగా రహదారి గుండా పీపీరావుకాలనీ, కల్వాడ, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాలకు వెళ్లాల్సి ఉంటుంది. యువత రహదారి బాగు చేయ డంతో ఆయాగ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కంకరతో గుంతలను పూడ్చుతున్న యువకులు

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

దహెగాం, ఆగస్టు 18: మండలంలోని చిన్న అయినం గ్రామానికిచెందిన జంగిలి చంద్రక్క(45) మతిస్థిమితం లేక ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై రమేష్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాలప్రకారం.. చంద్రక్క పురుగుల మందు తాగింది. పురుగుల మందు తాగిన విషయాన్ని తన ఇద్దరు సోదరులకు ఫోన్ ద్వారా తెలిపింది. దీంతో వారువచ్చి కాగజ్‌నగర్‌లోని ఓఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు తీసుకెళ్లారు. అక్కడివైద్యులు పరీక్షించి అప్పటికే ఆమెమృతిచెందినట్లు నిర్ధారించారు. చంద్రక్క కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



కార్మికుల సమస్యలపై పోరాటాలు

మందమర్రిటౌన్, ఆగస్టు 18: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లిరాజేందర్ తెలిపారు. ఆదివారం మందమర్రిలో వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించ కుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యలపరిష్కారం కోసం ఈనెల20నుంచి 28వరకు పోరాట కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేశారు.

'మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలి'

మందమర్రిటౌన్, ఆగస్టు 18: సింగరేణిలో ఉత్పత్తి ఉత్పాదకతలో కీలకపాత్ర పోషిస్తున్న మైనింగ్‌స్టాఫ్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ మైనింగ్‌స్టాఫ్ సమావేశానికి హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఈ మధ్యకాలంలో మైనింగ్‌స్టాఫ్‌ను ప్రతిదానికి బాధ్యులను చేయడం సరికాదన్నారు. మైనింగ్‌స్టాఫ్‌కు పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పించాలన్నారు. మైనింగ్ స్టాఫ్‌ను మరింత పటిష్టం చేయడానికి కమిటీలను ఎన్నుకుంటామన్నారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్‌లింగయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొనడం అభినందనీయం: జీఎం

శ్రీరాంపూర్, ఆగస్టు 18: ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూనేక్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు.కృష్ణకాలనీలోని శాంతిమైదానంలో ఆర్కే-5గనికి చెందిన ఉద్యోగులు ఆదివారం స్నేహపూర్వక క్రికెట్‌మ్యాచ్ ఆడారు. ఈ మ్యాచ్‌ను జీఎం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్, గనిమేనేజర్ అబ్దుల్ ఖాదిర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం'

రెబ్బెన, ఆగస్టు 18: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం జరిగిన ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఏఐటీయూసీ బెల్లంపల్లిరీజియన్ అధ్యక్షుడు ఉపేందర్ ఆరోపించారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. పర్మినెంటు ఉద్యో గులు చేయాల్సిన పనిని కూడా కాంట్రాక్టు కార్మికుల తో యాజమాన్యం చేయిస్తోందన్నారు. సీహెచ్‌పీలో బంకర్ వద్ద బెల్టు క్లీనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగి కార్మికుడికి గాయాలైనట్టు వివరించారు. సమావేశంలో కార్మిక సంఘ నేతలు సాగర్ గౌడ్, రాజశేఖర్ తదితరులున్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

● నేడు రక్షాబంధన్


బెజ్జూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బెజ్జూరు, ఆగస్టు 18: శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండగను జరుపుకుంటారు. జిల్లాలోని అన్ని మండ లాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలుదారులకు అనుకూలంగా రూపాయి మొదలుకొని రూ.1000వరకు రాఖీల ధరలు ఉన్నాయి. కొనుగోలుదారుల అవసరాలను బట్టి రకరకాల వెరైటీలు గల రాఖీలు వ్యాపారులు అందుబాటులో ఉంచారు. ఎక్కువగా మహిళలే రాఖీలను కొనుగోలుచేసి తమ సోదరులకు, నేస్తాలకు రాఖీ పండుగ రోజు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను వ్యక్తంచేస్తారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రాఖీలు, స్వీట్లు, పూల షాపులు జనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం రాఖీవేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

మార్కెట్‌లో వివిధ రాఖీలు..

రక్షాబంధన్ సందర్భంగా మార్కెట్లో రాఖీ సందడినెలకొంది. ప్రజలను ఆకట్టుకునేందుకు ఆయాదుకాణాల్లో రకరకాల రాఖీలను ప్రదర్శనకు ఉంచారు. బంగారం, వెండి, రాళ్ల పొదిగిన రాఖీలకు గిరాకీపెరిగింది. మార్కెట్‌లో కొత్తగా వచ్చిన డిజైన్‌రాఖీలు సందడిచేస్తున్నాయి. పేర్లతో కూడా రాఖీలను తయారు చేయించుకుంటున్నారు.

వెలసిన రాఖీ దుకాణాలు

సిర్పూర్(టి): సోమవారం రాఖీపౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలోని బస్టాండు ఏరియాలో రాఖీల దుకాణాలు వెలిశాయి. రకరకాల రాఖీలను ఏర్పాటుచేశారు. అదేవిధంగా ఆడపడుచులు తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు వెళుతుండడంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు కిక్కిరిసిపోయాయి.

నిందితుడికి ఉరిశిక్ష విధించాలి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 18: కోల్‌కతా వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారంచేసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, ప్రశాంత్, రాకేష్, రాజు, గణేష్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కెరమెరి, ఆగస్టు 18: మండలానికి చెందిన చౌదరి రమేష్ పిడుగుపాటుతో మృతిచెందగా ఆదివారం మాలిసంఘం మండలాధ్యక్షుడు తులసీరాం రూ.6వేలఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయనవెంటశ్యాంరావు, మనోహర్, చందు, సోమయ్య, తిరుపతి, నాగు,సోనేరావు తదితరులున్నారు.

పాము కాటుతో ఎద్దు మృతి

లింగాపూర్, ఆగస్టు 18: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జాదవ్‌లోకేందర్ అనేరైతు ఎద్దు ఆదివారం పాముకాటుతో మృతిచెందింది. లోకేందర్ రోజూలాగే ఆదివారం ఎడ్లను మేత మేయడానికి చేను సమీపంలో వదిలిపెట్టాడు. కొంతసేపు తర్వాత చూడగా ఒకఎద్దు నురగలు కక్కుతూ మృతిచెందింది. దీంతో పాముకాటుతో మృతిచెంది ఉంటుందని పేర్కొన్నాడు. ఎద్దు విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకు న్నాడు.

గుడుంబా స్వాధీనం

చింతలమానేపల్లి, ఆగస్టు 18: మండలంలోని రన్‌వెల్లిలో ఆదివారం గుడుంబా అమ్ముతోందన్న సమాచారం మేరకు చాపిడి రత్నక్క వద్ద తనిఖీ చేయగా అయిదు లీటర్ల గుడుంబా లభ్యమైందని ఎస్సై నరేష్ తెలిపారు. ఈమేరకు గుబుంబాను స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.